ప్రజాశక్తి
సోమవారం 9 అక్టోబర్ 2023
5
విజయనగరం



## అండర్-19 క్రికెట్‌లో మధ్యప్రదేశ్, అస్సాం బోణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో విజ్జీ స్టేడియం, పివిజిరాజు క్రికెట్ అకాడమీలో ఆదివారం జరిగిన బాలికల అండర్-19 వన్డే మ్యాచుల్లో మధ్యప్రదేశ్, అస్సాం జట్లు బోణీ కొట్టాయి. చింతలవలసలోనున్న పివిజి రాజు క్రికెట్ అకాడమీలో మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ జట్టు 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. బరోడా మొదటి బ్యాటింగ్ చేసి 47.4 ఓవర్లలో 116 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మధ్యప్రదేశ్ జట్టు 36.2 ఓవర్లలో 5 వికెట్లు నష్టానికి 119 పరుగులు చేసి విజయం సాధించింది. విజ్జీ క్రికెట్ మైదానంలో అస్సాం, బీహార్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అస్సాం విజయం సాధించింది. బీహార్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 33.4 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అస్సాం జట్టు 28 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 120 పరుగులు చేసి విజయం సాధించింది.

**కౌలు రైతుకు కష్టం వచ్చింది. వైసిపి ప్రభుత్వం కౌలురైతు చట్టం మార్పుతో సిసిఆర్‌సి పత్రాల మంజూరుకు చిక్కులొచ్చి పడ్డాయి. దీంతో ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన కౌలురైతుకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. గత ప్రభుత్వాల్లో కష్టాలు ఉన్నప్పటికీ వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 కౌలుచట్టం కౌలురైతు ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చేసింది. చట్టంలో భూయజమాని అంగీకారం ఉంటేనే కౌలురైతుకి పంట సాగు గుర్తింపు కార్డు (సిసిఆర్‌సి) ఇవ్వాలని పొందుపరచడం కౌలు రైతుకు మొదటికే మోసం వచ్చింది. ఈ నేపథ్యంలోనే కౌలురైతు గుర్తింపు ప్రహసనంగా మారింది. గత ఏడాది నుంచి సిసిఆర్‌సి పత్రాల మంజూరు అందుకు నిదర్శనం. ఈ ఏడాది ఇప్పటికీ 10 శాతం మందికీ కార్డులు మంజూరు చేయని పరిస్థితి.**

# కౌలురైతుకు కష్టం

- భూ యజమాని అంగీకరిస్తే పత్రం
- పత్రం లేకుంటే ప్రభుత్వ రాయితీలు కట్
- నామమాత్రంగానే కౌలు గుర్తింపు
- ఆందోళనలో కౌలుదారులు

ప్రజాశక్తి - జామి

విజయనగరం జిల్లాలో 2.27 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, పార్వతీపురం మన్యం జిల్లాలో 1,82,217 ఎకరాల్లో వరి సాధారణ విస్తీర్ణంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో సుమారుగా 4 లక్షల మందికి పైగా రైతులున్నారు. ఇందులో సుమారుగా 40 శాతం మంది అనగా 1.60 లక్షల మంది వరకు కౌలురైతులు ఉన్నట్లు అంచనా. కానీ అధికారిక లెక్కల ప్రకారం కేవలం 20 వేల మంది ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే వైసిపి ప్రభుత్వం 2019 కౌలు చట్టంతో ఉన్నవారికి కూడా గుర్తింపు దక్కని పరిస్థితి దాపురించింది. గతంలో 2011 చట్టంతో గ్రామసభ ద్వారా కౌలురైతుల గుర్తింపు జరిగేది. కానీ వైసిపి తీసుకొచ్చిన చట్టంతో భూయాజమాని అంగీకారం తప్పనిసరి చేసింది. దీంతో ఈ ఏడాది పూర్తిగా కౌలు రైతుకు మొండి చేయి చూపించారు. ఇ-క్రాప్, బయోమెట్రిక్‌తో అన్ని సేవలు ముడిపెట్టడం వల్ల కౌలురైతుకు ప్రభుత్వ సేవలు, రాయితీలు దక్కడం లేదు. చివరికి పంట నష్టం వాటిల్లినప్పుడు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ, బీమాలు అక్కరకు రాని దుస్థితి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజాగా ఇ-క్రాప్ చేపట్టడంతో కౌలురైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

వాస్తవానికి జిల్లాలో మూడు రకాలుగా కౌలు సాగు చేస్తున్నారు. కొంతమంది తనఖా పద్ధతిలో సాగు చేస్తున్నారు. మరికొంత మంది అరకొర భూమి ఉన్నప్పటికీ దానితో పాటు కొంత భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. మరికొంత మంది గల్లా పద్ధతిలో (ఏడాదికి కొన్ని బస్తాలు తీసుకునే లెక్కన) కౌలుకు చేయడం జరుగుతోంది. వాస్తవానికి యజమాని బంధువులు, సన్నిహితులు తప్ప సామాన్య, నిజమైన కౌలురైతుకు మాత్రం గుర్తింపు లభించడం లేదు. దీంతో జిల్లాలో కౌలురైతులు వ్యవసాయానికి దూరమవుతున్నారు. అధికారులు కూడా భూయజమానులకు అనుకూలంగా వ్యవహరించి, సిసిఆర్‌సి గుర్తింపు పారదర్శకంగా చేపట్టడం లేదన్న వాదన లేకపోలేదు. దీంతో కౌలురైతుకు విత్తనం, ఎరువు మొదలుకొని ధాన్యం కొనుగోలు, పంట నష్ట పరిహారం వంటివి కూడా దక్కని పరిస్థితి. కనీసం బ్యాంకు రుణాలు కూడా యజమానులే పొందుతున్నారు. కౌలు గుర్తింపు కాలపరిమితి కేవలం 11 నెలలు మాత్రమే. ఈ విషయం తెలిసినా లేనిపోని అపోహలు అన్న సాకు కౌలురైతులకు తీరని నష్టం చేకూరుస్తోంది. ప్రభుత్వం పరోక్షం చట్టాలతో కౌలురైతుని నష్టపరుస్తుందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం సాగుదారులందరినీ గుర్తించి, కౌలు గుర్తింపు హక్కు ఇవ్వాలని ఏపి రైతుసంఘం కోరుతోంది.

**గత ఐదేళ్లలో జిల్లాలో కౌలుగుర్తింపు**

| సంవత్సరం | మంజూరైన కార్డులు |
|---|---|
| 2018-19 | 7,500 |
| 2019-20 | 11,900 |
| 2020-21 | 19,468 |
| 2021-22 | 12,000 |
| 2022-23 | 11,000 |

### సాగును బట్టి ఇ-క్రాప్ చేయాలి

పంట సాగు ఆధారంగా ఇ-క్రాప్ చేపట్టాలి. క్షేత్ర స్థాయిలో ఎవరు వ్యవసాయం చేస్తున్నారో ప్రభుత్వమే అధికాలతో గుర్తించి, సాగు హక్కు ఆధారంగా ఇ-క్రాప్ చేపట్టాలి. అప్పుడే నిజమైన రైతులకు ప్రభుత్వ సేవలు అందుతాయి. వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టంతో కౌలురైతులకు తీరని నష్టం. కాబట్టి ఆ బాధ్యత ప్రభుత్వమే తీసుకుని, ప్రతి కౌలురైతుకు సిసిఆర్‌సి పత్రాలు మంజూరు చేయాలి. లేకుంటే ఫీల్డ్‌స్థాయిలో రైతును గుర్తించి న్యాయం చేయాలి.

**- బి.రాంబాబు, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి**

### యజమాని అంగీకారంతోనే సిసిఆర్‌సి

భూ యజమాని అంగీకారంతోనే కౌలుగుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. యజమానులకు ఉన్న అపోహలు తొలగించి, కౌలు చేసిన రైతుకు కార్డులు మంజూరుకు కృషి చేస్తున్నాం. సిసిఆర్ కార్డులతో సంబంధం లేకుండా ఇ-క్రాప్ చేస్తున్నాం. ప్రతి రైతు తమ పరిధిలోని ఆర్‌బికెల ద్వారా తప్పనిసరిగా ఇ-క్రాప్ చేసుకొని తీరాలి. లేకుంటే ప్రభుత్వ రాయితీలు అందవు.

**- కిరణ్ కుమార్, ఎఒ, జామి**

# చిన్న శ్రీను చదరంగానికి బొత్స చెక్!

- ఎచ్చెర్లను తాకిన జిల్లా రాజకీయాలు
- ఎంపి బెల్లానకు బుజ్జగింపుల బాధ్యత

**వైసిపి జిల్లా రాజకీయాలు విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లను తాకాయి. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగానే, విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్‌కు నియోజకవర్గంలో అసమ్మతి గ్రూపు బుజ్జగింపుల బాధ్యతను అప్పజెప్పడం చర్చనీయాశంగా మారింది. ఎచ్చెర్ల రాజకీయ పరిణామాలు యాదృచ్ఛికంగా నడుస్తున్నాయా? లేక మంత్రి బొత్స సత్యనారాయణ తన వ్యూహానికి పదును పెట్టారా? అన్న చర్చ ముమ్మరంగా సాగుతోంది.**

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీలో చాలా కాలంగా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి విజయనగరం జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) జోక్యం ఇటీవల ఎక్కువగానే కనిపించింది. దీంతో, అక్కడి ముఖ్య నాయకులంతా ప్రజా సమస్యలు, రాజకీయ అంశాలపై కొంతకాలంగా చిన్న శ్రీనుతోనే చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీను అభిమానులంతా ఆయన జన్మదినోత్సవం రోజు ఎక్కడికక్కడ భారీ ఫ్లెక్సీలు కట్టడం, వాటిని గుర్తు తెలియని వ్యక్తులు చించేయడం, ఈ పని ఎమ్మెల్యే కిరణ్ అనుకూల గ్రూపేనంటూ అనుమానించడం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో చిన్న శ్రీను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం కూడా కాస్త ఎక్కువగానే సాగింది. అందువల్లే అక్కడ ఎమ్మెల్యే వ్యతిరేక గ్రూపునకు దగ్గరయ్యారని కూడా చాలా మంది విశ్లేషించారు. అందుకు తగ్గట్టే కిరణ్‌కుమార్ వ్యతిరేక గ్రూపు 'ఎమ్మెల్యే వద్దు... జగన్ ముద్దు' అంటూ ఒకానొక సందర్భంలో పెద్దపెట్టున నినాదాలు కూడా చేశారు. మొత్తం వ్యవహారాన్ని పసిగట్టిన మంత్రి బొత్స సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా ఇన్‌ఛార్జి హోదాలో ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో నినాదాలపై 'వాటీజ్ నాన్సెన్స్' అంటూ ఘాటుగానే స్పందించారు. ఆ తరువాత కొద్దిరోజులకే ఎచ్చెర్ల నియోజకవర్గంలో అసమ్మతి గ్రూపు బుజ్జగింపుల బాధ్యతలు బెల్లానకు అప్పగించారు. తాజాగా ఎంపి బెల్లాన.. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని కీలకమైన నాయకులను పిలిపించుకుని రాజకీయాలపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా వ్యతిరేక గ్రూపుతో అంతర్గత విషయాలపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ఇప్పటికే ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌పై చాలాకాలంగా గుర్రుగా ఉన్న ఆయన కుటుంబ సభ్యులు సయోధ్యకు సిద్ధమైనట్టు తెలుస్తోంది.

ఎన్నికలలోపు నియోజకవర్గంపై ఎంపి బెల్లాన పట్టుసాధిస్తే సీటు కేటాయింపు విషయంలో ఆలోచించవచ్చని మంత్రి బొత్స ఉన్నట్టుగా పలువురు విశ్లేషిస్తున్నారు. అదే జరిగితే చిన్న శ్రీను సంగతి ఎలా ఉంటుందోనన్న చర్చ కూడా నడుస్తోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు గాను చీపురుపల్లి, గజపతినగరంలో ఇప్పటికే మంత్రి బొత్స, ఆయన సోదరుడు అప్పలనర్సయ్య పాగా వేశారు. నెల్లిమర్లలో చిన్న శ్రీను బావే సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో సీటు కూడా ఆశిస్తున్నారు. ఈ మూడు కాపు సామాజిక తరగతికి కేటాయిస్తే, శృంగవరపుకోట, బొబ్బిలి నియోజకవర్గాలు వెలమ సామాజిక తరగతికి కేటాయించే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రాజాం ఎస్‌సి రిజర్వుర్డు నియోజకవర్గం. విజయనగరం నుంచి పోటీకి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఉన్నారు. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను పరిస్థితి ఎలా ఉంటుందో అన్న దానిపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

## ఫైనల్‌కు వాలీబాల్ జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కడప జిల్లాలో జరుగుతున్న అండర్-17 రాష్ట్ర వాలీబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు ఫైనల్‌కు చేరింది. లీగ్‌లో పూల్ విన్నర్‌గా నిలిచిన జిల్లా జట్టు.. క్వార్టర్ ఫైనల్లో ప్రకాశం జిల్లా జట్టును 25-11, 25-11 తేడాతో ఓడించింది. శ్రీకాకుళం జట్టుతో జరిగిన సెమీఫైనల్లో 2-1 సెట్ల తేడాతో విజయం సాధించింది. సోమవారం జరిగే రెండో సెమీఫైనల్లో పశ్చిమగోదావరి, అనంతపురం జట్లు తలపడనున్నాయి. అందులో గెలిచిన జట్టుతో విజయనగరం జట్టు ఫైనల్లో తలపడనుంది.

**మండలంలోని పెదతాడివాడలో ప్రయివేటు ఫంక్షన్ హాల్లో సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను సిపిఎం సీనియర్ నాయకులు ఎంవిఎస్ శర్మ సిపిఎం జెండాను ఆవిష్కరించి, ప్రారంభించారు.**

- ప్రజాశక్తి, డెంకాడ

## పైడితల్లమ్మ సిరిమాను చెట్టు గుర్తింపు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పైడితల్లమ్మ సిరిమానోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. అత్యంత కీలకమైన సిరిమాను ఘట్టానికి అవసరమయ్యే చెట్టును జరజాపుపేట వద్ద గుర్తించారు. ఈ చెట్టుకు ఆలయ అధికారులు, పూజారులు, స్థానిక పెద్దలు ఆదివారం పూజలు నిర్వహించారు. తుమ్ము అప్పారావు కుటుంబానికి చెందిన కళ్లంలో ఈ చెట్టును గుర్తించారు. ఈ నెల 15న విజయనగరం తరలిస్తామని పైడితల్లమ్మ ఆలయ ఇఒ సుధారాణి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న పూజారి, సిబ్బంది

## ఆరోగ్య హక్కు చట్టం చేయాలి

**రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్య హక్కు చట్టం చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్తు మినిస్టీరియల్ హాల్లో జనవిజ్ఞాన వేదిక, ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సంయుక్త ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశాయి. ఈ సమావేశంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజల ఆరోగ్య భద్రత నేడు ప్రమాదంలో పడిందన్నారు. ఏదేశ అభివృద్ధి అయినా ఆ దేశ పౌరుల ఆరోగ్యంపై ఆధార పడి ఉంటుందని అనేక అధ్యయనాలు తేల్చిచెప్పాయని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతున్న పాలకులు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కచ్చితంగా ఆరోగ్య హక్కు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ఆదేశానుసారం దేశ పౌరుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణ ప్రభాత్ ఆరోగ్య హక్కు చట్టం ఆవశ్యకతపై తీర్మానంతోపాటు భవిష్యత్తు కార్యాచరణను ప్రవేశపెట్టగా ప్రజా సంఘాల ప్రతినిధులు దానిని ఏకగ్రీవంగా ఆమోదించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జె.మురళి, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జివిఎస్ఎన్ మూర్తి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు శ్యామ్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుధారాణి, ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ప్రజారోగ్య వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు సూర్య భగవాన్, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌నాయుడు, సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కె.మురళీబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు

## విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కాకినాడ ఉమామహేశ్వరరావు, వెదురుపత్తి గీతాసత్య ఎన్నికయ్యారు. ఆదివారం విజయనగరం రోటరీ క్లబ్‌లో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులతోపాటు మరో ఐదుగురు సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నిక ప్రక్రియ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళాబత్తుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ కోసం కృషి చేస్తామన్నారు.

## బిటి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని తోటపాలెం సిద్ధార్థనగర్, మౌర్య గార్డెన్స్ ప్రాంతాల్లో సుమారు రూ.34 లక్షల వ్యయంతో చేపట్టిన బిటి రోడ్డు, ఇతర అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్‌గా నగరం కనిపించే విధంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే డివిజన్ పర్యటనలో గుర్తించిన సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు రెడ్డి గురుమూర్తి, బాలబ్రహ్మారెడ్డి, నాయకులు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్, మేయర్

## అవినీతి ప్రభుత్వాన్ని తరిమేద్దాం

**జనసేన నేత గురాన అయ్యలు**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవినీతి ప్రభుత్వాన్ని తరిమేసి, ప్రజా ప్రభుత్వాన్ని స్థాపిద్దామనే నినాదంతో ఇంటింటికి జనసేన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నేత గురాన అయ్యలు అన్నారు. ఇంటింటికి జనసేన కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ నగర్‌లో ఆదివారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా జనసేన పని చేస్తోందన్నారు. వైసిపి అధికారంలోకి రాకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని అధికార పార్టీ నాయకులు చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. జనసేన-టిడిపి కూటమి అధికారంలోకి వస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలకు మరింత అదనంగా జోడించి పేదలను ఆదుకునేలా తమ ప్రణాళికలు ఉంటాయన్నారు. విజయనగరంలో సుందరీకరణ పేరుతో అడ్డగోలు సంపాదనకు స్థానిక ప్రజాప్రతినిధి వినూత్న ఆలోచనలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్మును విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తోట రమేష్, సియ్యాదుల ఝూన్సీ, భరత్, సియ్యాదుల శేఖర్, జనసేన నాయకులు పిడుగు సతీష్, పి.రాజ్యలక్ష్మి, ఆర్.కవిత, కె.పుష్ప పాల్గొన్నారు.

# రైతులకు ఇకెవైసి తప్పనిసరి

- 99 శాతం ఇ-క్రాప్ నమోదు
- ఆశాజనకంగా వరి
- ఎరువులకు ఢోకాలేదు
- డ్రోన్ పైలెట్ శిక్షణకు 17 మంది
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖాధికారి విటి రామారావు ముఖాముఖి

**జిల్లాలోని రైతులంతా ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు కోరారు. ఇకెవైసితో ప్రభుత్వ పథకాలన్నీ ముడిపడి ఉంటాయని స్పష్టంచేశారు. జిల్లాలో వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు. జిల్లాలో యూరియా సహా అన్ని రకాల ఎరువులూ అందుబాటులో ఉన్నాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 17మంది యువ రైతులను ఎంపిక చేసి డ్రోన్ పైలెట్ శిక్షణకు పంపామన్నారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ఆయన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..**

- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

**ఇకెవైసి ప్రాధాన్యత ఏమిటి.?**

పంటల బీమా, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, రైతు భరోసా వంటి పథకాలు సహా రైతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని రకాల ప్రభుత్వ పథకాలకు ఇకెవైసి తప్పనిసరి. ఈ నేపథ్యంలో రైతులు ఆర్‌బికెలకు వచ్చి ఇకెవైసి నమోదు చేయించుకోవాలని కోరుతున్నాం. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే ఇకెవైసి వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుంది.

**ఇ-క్రాప్, ఇకెవైసి ప్రక్రియలు ఎంత వరకు వచ్చాయి.?**

ఇ-క్రాప్ నమోదు దాదాపు పూర్తి కావస్తోంది. ఇప్పటి వరకు అన్ని పంటలూ కలుపుకుని 99 శాతం అయింది. ఇందులో రైతుల ఇకెవైసి నమోదు తప్పనిసరి. ఇది ఇప్పటి వరకు 71శాతం వరకు వచ్చింది. ఆర్‌బికెల ద్వారా ఈ నమోదు ప్రక్రియ వేగవంతం చేస్తున్నాం. ఇందుకు రైతులు కూడా సమయం కేటాయించి మాకు సహకరించాలి. సిబ్బంది సాంకేతిక సమస్యలను అధిగమించి పనిచేయాలి.

**ఈ ఏడాది వరి పంట ఎలా ఉంది.?**

ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగానే ఉంది. ప్రస్తుతం రాజాం, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో వరి పొట్టదశకు చేరింది. మిగిలిన ప్రాంతాల్లో చాలా వరకు అంకర దశలో ఉంది. ఆలస్యంగా నాట్లుపడిన చోట్ల వరిచేను దుబ్బుచేస్తోంది. ఈ సమయంలో వరికి నీరు ఎక్కువగా అవసరం. వరుణుడు కరుణిస్తే అన్నదాతకు అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదనడంలో సందేహం లేదు.

**వరి సాగు విస్తీర్ణం ఎంత మేర జరిగింది.?**

దాదాపు లక్ష్యానికి అనుగుణంగానే వరిసాగు విస్తీర్ణం కనిపిస్తోంది. ఈ ఏడాది 2,25,637 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 2,24,632 ఎకరాల మేర సాగైంది. దాదాపు 99శాతం సాగైనట్టు లెక్క. వర్షాభావ పరిస్థితుల వల్ల ఆ ఒక్క శాతమైనా తగ్గింది. ప్రస్తుతం వరి ఆశాజనకంగానే ఉంది. యాజమాన్య పద్ధతుల్లో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశాలు కూడా మెండుగానే ఉన్నాయి.

**ఎరువులు సరఫరా ఎలా ఉంది.?**

ఎరువులు పుష్కలంగా ఉన్నాయి. మన జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి అన్ని పంటలకూ కలుపుకుని యూరియా, డిఏపి, పొటాష్, తదితర కాంప్లెక్స్ ఎరువులు కలుపుకుని 21 వేల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, ఇప్పటి వరకు 27 వేల మెట్రిక్ టన్నుల మేర జిల్లాకు చేరాయి. ఇందులో ఆర్‌బికెల ద్వారా సగం, ప్రయివేటు దుకాణాల ద్వారా సగం విక్రయిస్తున్నాం.

**ఎన్ని ఆర్‌బికెల్లో ఎరువులు ఉన్నాయి.?**

జిల్లా వ్యాప్తంగా 494 ఆర్‌బికెల ద్వారా ఎరువులు విక్రయానికి పెట్టాం. ప్రస్తుతం 120 ఆర్‌బికెల్లోనే ఉన్నాయి. మిగిలిన చోట్ల విక్రయాలు పూర్తయ్యాయి. ఎక్కడికైనా ఇంకా అవసరమైతే వెంటనే పంపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. శనివారం సుమారు 700 మెట్రిక్ టన్నుల మేర ఎరువులు జిల్లాకు చేరాయి.

**జిల్లాలో డ్రోన్ల వినియోగ ప్రయత్నం ఎంత వరకు వచ్చింది.?**

వ్యవసాయ రంగంలో అనేక మార్పులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఎరువులను కూడా డ్రోన్ సిస్టమ్ ద్వారా పంటలకు వేసేందుకు ప్రభుత్వం తలపెట్టింది. ఇందులో భాగంగా మండలానికి ఒక డ్రోన్ సబ్సిడీపై మంజూరు చేయాలని నిర్ణయించింది. దీన్ని ఆపరేట్ చేసేందుకు తొలుత పైలెట్లను తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకు మన జిల్లా నుంచి 17 మండలాలకు చెందిన యువ రైతులు డ్రోన్ పైలెట్ శిక్షణకు వెళ్లారు. మిగిలిన మండలాల నుంచి కూడా పంపే ప్రయత్నం చేస్తున్నాం.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

**బొబ్బిలి:** రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారాది వంతెన పురాతన వంతెన కావడంతో కుంగిపోయిందని, వంతెన కుంగిపోవడాన్ని రాజకీయంగా వినియోగించుకోవడం అన్యాయమన్నారు. టిడిపి తప్పుడు ప్రచారానికి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న వైసిపిని ప్రజలు గెలిపించి టిడిపికి మరోసారి బుద్ధి చెపుతారన్నారు. రాజులు 15ఏళ్ల పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఈ నాలుగున్నరేళ్ల పాలనలో నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ఆయనతో పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, ఉన్నారు.

## ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి

**శృంగవరపుకోట :** సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సమాచార హక్కు చట్టం జిల్లా సమన్వయ కమిటీ మెంబర్ దొడ్డి సూర్యారావు అన్నారు. సమాచార హక్కు చట్టం వచ్చి ఈ నెల 12 నాటికి 18 సంవత్సరములు పూర్తవుతున్న సందర్భంగా సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సును పట్టణంలోని ఆకుల డిపో వెనుక గల బీసీ హాస్టల్ ఆవరణలో వార్డెన్ సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఫోర్ వన్ బి కానీ, పిఐఓ ఏపీ ఐఓ అప్లియేట్ అథారిటీ బోర్డులు లేకపోవడం బాధాకరమన్నారు. ఈ చట్టంలో సెక్షన్ 26 ప్రకారం ప్రభుత్వం 18 నెలల్లో దేశంలో ఉన్న ప్రజానీకానికి అంతటికీ అవగాహన కల్పించాల్సి ఉండగా అటువంటి దాఖలాలు లేకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం కార్యకర్త ధనుంజయ్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న రాజు

**బొబ్బిలి:** అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి రోటరీ క్లబ్ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జెసి రాజు, బట్టల వ్యాపారి శంకరరావు మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని మల్లమ్మపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కొన్ని నెలలుగా గుర్తు తెలియని వ్యక్తి మానసిక వ్యాధితో ఒకేచోట ఉండిపోయాడు. ఆ వ్యక్తి బక్కచిక్కిపోవడంతో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జేసీ రాజు, వారాణసి శ్రీహరి, ప్రజాశక్తి విలేకరి రాయగడ జగదీశ్వరరావు కలిసి సపర్యాలు చేసి ఆహారాన్ని అందించేవారు. ఆరోగ్యం క్షీణించడంతో శనివారం రాత్రి అతను మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జేసీ రాజు, శంకరరావు మృతదేహాన్ని వైకుంఠ రథంలో భైరిసాగరం చెరువులో ఉన్న స్మశానం వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. మానవత్వాన్ని చాటుకున్న జేసీ రాజు, శంకరరావును పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు.

## రోడ్డును బాగుచేయండి

**బొబ్బిలి:** పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఎదురుగా హైవే రహదారిపై పెద్ద పెద్ద గుమ్ములు ఏర్పడి చాలాకాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే రోడ్డును బాగుచేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు ఆదివారం డిమాండ్ చేశారు. కాంప్లెక్స్ దగ్గర నుంచి పాత బొబ్బిలి వెళ్లే వరకు అనేకచోట్ల ఇదే పరిస్థితి ఉందన్నారు. పాడైపోయిన చోట బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మెట్టవలస శంకర్రావు, ప్రసాద్, రామారావు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యుఎస్ డిఇకి సత్కారం

**వేపాడ:** మండలంలోని సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజును సర్పంచులు సత్కరించారు. జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ అవార్డు పొందినందుకు గాను ఆయన సేవలను గుర్తించి మండలంలో గల సర్పంచులు అందరూ కలిపి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి. సత్యవంతుడు, జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలి

**కొత్తవలస :** క్రీడల్లో యువకులు రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవి. సుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ క్రీడాకారుడు, శిక్షకుడు ములపర్తి ప్రకాశరావుకు ఇటీవల గయాన్ ఉదయ్ ఫౌండేషన్ ఇండియన్ ఐకాన్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆదివారం విశాఖపట్నంలో తన క్యాంపు కార్యాలయం వద్ద తనను ప్రకాశరావు కలిశారు. ఈ నెల 16 వ తేదీ నుండి 22 వ తేదీ వరకు బాంగ్లాదేశ్‌లో జరగనున్న ఇంటర్నేషనల్ టైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలకు వెళ్తున్న ములపర్తి ప్రకాశరావును, తనకు చిన్ననాటి నుండి విద్య నేర్పిన తన గురువు పాండ్రంగి రుకముఖరావును అభిందించారు.

## డిఎస్‌పి పావనికి గ్రామీణ వైద్యుల సత్కారం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అలుగోలు గ్రామానికి చెందిన డిఎస్‌పి కెల్ల ఉదయపావనిని గ్రామీణ వైద్యుల సంఘం ఆదివారం గ్రామంలో సత్కరించింది. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో గ్రూప్ - 1 విజేతగా నిలిచి డిఎస్‌పిగా ఎంపికైన ఉదయ పావనిని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గెద్ద చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మాట్లాడుతూ సామాన్య మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఉదయపావని డిఎస్‌పిగా ఎంపిక కావడం గ్రామానికే గర్వ కారణమని కొనియాడారు. సామాజిక సమస్యలపై దృష్టి సారించాలని, వాటి పరిష్కారానికి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ బాలాజీ హాస్పిటల్ యమ్‌డి ఆల్తి రమణ, సంఘం కోశాధికారి పరవాడ ఉమాశంకర్, మహిళా నాయకులు భవాని తదితరులు పాల్గొన్నారు.

## గణపతి సన్నిధిలో కోళ్ల దంపతులు

**కొత్తవలస :** మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వరస్వామి రూపంలో దర్శనం ఇస్తున్న విఘ్నేశ్వరునిగా పేరుపొందిన స్వామిని ఆదివారం నియోజకవర్గ ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం గణపతి మండపంలోని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటరమణ (శ్రీను), నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, పొట్నూరు వేంకటరత్నాజీ, పిల్లా అప్పలరాజు, పప్పు అప్పలరాజు, వల్లేపు కైలాస్, పిల్లా లక్ష్మీ, అడ్డూరి సత్యనారాయణ, రాజాన భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్ చేతిలో సిఐడి కీలుబొమ్మ

**వేపాడ :** జగన్ చేతిలో సిఐడి కీలుబొమ్మగా మారిందని జాతీయ మానవ హక్కుల కమిటీ వైస్ చైర్మన్ కదిరి రాము ( న్యాయవాది) ఒక ప్రకటనలో ఆరోపించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ అధికారులను యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించి ఎన్నికల్లో పాల్గొనకుండా ఇబ్బందులకు గురి చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరలా జగన్ మోహన్ రెడ్డికి జైలు జీవితం తప్పదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఓటు రూపంలో జగన్మోహన్ రెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.

## భోగాపురంలో నేడు ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- భోగాపురం

మండల కేంద్రంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ నాయుడు తెలిపారు. భోగాపురం ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పంచాయితీ పరిధిలోని ప్రజలందరు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



గోపూజ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

## ధర్మ ప్రచారం ప్రారంభం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ధర్మ ప్రచారం ప్రారంభమైంది. ఈ నెల 8 నుండి 14వరకు జరుగు ధర్మ ప్రచారంలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు దంపతులు గోపూజతో ప్రారంభించారు. అనంతరం టిపి రాధాకృష్ణమాచార్యులు శ్రీమద్రామాయణం ప్రవచన ఉపన్యాసం నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ బిహెచ్‌విఎస్ఎన్ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్త మండలి సభ్యులు, సర్పంచ్, అర్చకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి 'చీకటి'

- కనీస సౌకర్యాలు లేని చీకటిపేట
- దళిత వాడలో జరగని స్వచ్ఛభారత్
- ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని చీకటిపేట గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి నివసిస్తున్న ఈ దళితవాడలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎంతమంది ప్రజాప్రతినిధులు మారిని తమ తలరాతులు మారడం లేదని వాపోతున్నారు. సర్పంచులు మారినప్పటికీ గ్రామాభివృద్ధి మాత్రం జరగడంలేదని చెబుతున్నారు. కాలువల్లో పూడిక తీతలైన కనీసం తీయడం లేదని, ఫలితంగా కాలువలన్నీ పూడికలతో కప్పుడపోయాయని చెబుతున్నారు. పైగా రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు వేపుగా పెరిగిపోవడం వల్ల పాములు, తేళ్ల విష పురుగులు తిరుగుతున్నాయని దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని వాపోతున్నారు. కాలువలు బాగు చేయండి మహాప్రభో అని సర్పంచ్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని, సెక్రెటరీ కూడా కన్నెత్తి చూడటం లేదని మండిపడుతున్నారు. కనీసం వీధిలైట్లు కూడా సమకూర్చలేని పరిస్థితిలో నాయకత్వం ఉందని

అభివృద్ధికి నోచుకోని దళితవాడ

వాపోతున్నారు. స్వతంత్ర్యం వచ్చి ఈన్నేళ్లయినప్పటికీ దళితవాడలు అభివృద్ధికి నోచుకోకపోవడానికి కేవలం నాయకుల నిర్లక్ష్యమే కారణంగా చెబుతున్నారు.

**దళితవాడలో జరగని స్వచ్ఛభారత్**

స్వచ్ఛభారత్‌లో భాగంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర పిచ్చి మొక్కలు తొలగింపునకు సర్పంచ్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించినప్పటికీ పూర్తి స్థాయిలో చేయకుండా దళితులను దుర్భాషలాడుతూ అక్కడి నుంచి బీసీ కాలనీకి వెళ్లిపోయారని ఆ గ్రామ దళిత మహిళలు వాపోయారు. ఓట్లు వచ్చినప్పుడు తాము కావాలి తర్వాత తమ కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి చీకటిపేట దళిత వాడపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాద స్థితిలో ప్రాథమిక పాఠశాల**

మండలంలోని చీకటిపేట ప్రాథమిక పాఠశాల ప్రమాదపు అంచున కొట్టిమిట్టాడుతోంది. ఈ భవనానికి ఉన్న మూడు పిల్లర్లు పెచ్చులూడిపోయి బీటలు వారి ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు చదువుతుండగా ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థులు సంఖ్య తక్కువుగా ఉండటంతో నాడు నేడు పనులు చేపట్టలేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

## సొంత సొమ్ముతో గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆగూరు పంచాయితీ ప్రజల కష్టాలు వర్ణనాతీతం. ఆ ఊరు వెళ్లాలంటే చంపావతి నది దాటాల్సిందే. ఏడాది క్రితం గ్రామస్థులు ఏకమై జిటిపేట నుంచి ఆగూరు గ్రామం వరకు సుమారు అరకిలోమీటరు మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి రాకపోకలకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రయాణం సాగిపోతుంది. రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడాదికే గోతులమయం కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కష్టాలను చూసి చలించిపోయిన వైసిపి నాయకులు పాశల ప్రసాద్ తమ సొంత సొమ్ముతో గోతులమయమైన మట్టిరోడ్డును కంకరతో నింపి ప్రజల కష్టాలను తీర్చే బాధ్యత తీసుకున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సర్వర్ సమస్య

- సర్వర్ పనిచేయక లబ్ధిదారులకు ఇబ్బందులు
- ఐదు నుంచి పంపిణీ కాని రేషన్
- వేర్వేరుగా బయోమెట్రిక్‌తో అవస్థలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలో 39 గ్రామ పంచాయతీలు, 51 రెవెన్యూ గ్రామాలతో పాటు మరో 15 హేబిటేషన్ గ్రామాలలో వాహనాల ద్వారా రేషన్ పంపిణీకి సర్వర్ పనిచేయకపోవడంతో ఎండి ఆపరేటర్లు, రేషన్ లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల ఐదు నుంచి శనివారం వరకు సర్వర్ పనిచేయక రేషన్ సరుకులు పంపిణీ కాక పేద ప్రజలు రేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతిరోజు రేషన్ వద్దకు లబ్ధిదారులు వచ్చి క్యూలో ఉన్నప్పటికీ సర్వర్ పనిచేయక రోజులు తరబడి నిరీక్షించవలసిన పరిస్థితి ఉంది.

మండలంతో పాటు జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో రేషన్ సరుకులు అమ్మిన ఎండి ఆపరేటర్లు బయోమెట్రిక్‌లు వేసిన లబ్ధిదారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్ పనిచేయకపోవడంతో బియ్యం పంపిణీ ఆలస్యం అవుతుందని వెల్లడించారు. దీనికి తోడు బియ్యానికి ఒక వేలిముద్ర వేస్తే,

సరుకులు కోసం వేచి చూస్తున్న లబ్ధిదారులు

పంచదార, పప్పులకు రెండోసారి బయోమెట్రిక్ లబ్ధిదారులు వేయడంతో ప్రతి లబ్ధిదారుల వద్ద ఆలస్యం అవుతుందని, అందుకు రేషన్ పంపిణీ చేయలేకపోతున్నామని వాహనదారులు తోపాటు లబ్ధిదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి సర్వర్ పనిచేసేందుకు వేరే సిమ్మును ఏర్పాటు చేస్తారని రేషన్ లబ్ధిదారులు, వాహనదారులు కోరుతున్నారు.

# తాటిపూడి వద్ద విద్యుత్తు చౌర్యం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తాటిపూడి విజయనగరం మార్గంలో రెండు నెలలుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ తాటిపూడి వద్ద గోస్తని నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమే స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం అక్కడికి వెళ్లి ప్రజాశక్తి పరిశీలించగా తాటిపూడి గెస్ట్ హౌస్ దగ్గరలో ఉన్న ఒక ఇనుప స్తంభం నుండి ఈ విద్యుత్ సౌర్యానికి పాల్పడుతున్నట్లు వెల్లడైంది. ఈ స్తంభం నుంచి బ్రిడ్జి వరకు భూమి లోపల నుండి వైర్లను లాగి ఈ విద్యుత్ సౌర్యానికి పాల్పడుతున్నారు. దీనివల్ల వారికి ప్రతిరోజు సుమారు 100 నుండి 150 లీటర్ల వరకు డీజిల్ ఆదా అయినట్టు తెలుస్తుంది. ఈ కరెంట్ తాటిపూడి నుంచి కృష్ణాపురం జలశుద్ధి కర్మాగారం లైన్ కావడంతో వారే బిల్లులు యథావిధిగా ప్రతి నెల చెల్లించుకోవడం జరుగుతుంది. అయితే ఈ విషయమే జలశుద్ధి కర్మాగారం ఉద్యోగులను వివరణ

దొంగతనంగా ఇక్కడి నుంచే విద్యుత్తు సరఫరా

కోరగా తమకేమీ తెలియదు అంటూనే ఏఈ రాజశేఖర్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే దొంగ విద్యుత్ కనెక్షన్‌ను తొలగించడంతోపాటు ఈ విద్యుత్ సౌర్యానికి ఒక ఉద్యోగి సహకరించినట్లు ఈ విషయమే వారు ఉన్నతాధికారులకు తెలియజేశామని అన్నారు. ఇదిలా ఉండగా నెలల తరబడి భారీ పను లకు విద్యుత్ సౌర్యం జరుగుతున్నా అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పేదవాడు కనీసం ఒక బల్బు కోసం ఎక్కడైనా వైరు లాగితే సవా లక్ష నిబంధనలు చెప్పే అధికారులకు ఇటువంటివి ఎందుకు కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు

# నల్ల ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - భోగాపురం

తీర ప్రాంతమైన ముక్కాం గ్రామ సమీపంలో నల్ల ఇసుక తరలింపు మళ్లీ మొదలైంది. శనివారం రాత్రి కొంత మంది వ్యక్తులు హేచరీస్ సమీపంలోని తోటల్లోకి సముద్రం నుంచి ఇసుకను తరలించి పోగులు వేశారు. దీంతో ఈ సమాచారం తహశీల్దారు బంగార్రాజుకు చేరడంతో ఆయన వెంటనే వీఆర్‌ఓను పరిశీలించాలని ఆదేశించారు. ఈమేరకు వీఆర్ఓ శ్రీలక్ష్మి ఆ గ్రామానికి వెళ్లి తోటల్లో ఉన్న పోగులను పరిశీలించారు. ఇటీవలి రెండు నెలలు కిందట ఈ ఇసుక తరలింపు జోరుగా ఉండేది. పత్రికల్లో కథనాలు రావడంతో అక్రమార్కులు వెనక్కి తగ్గారు. మళ్లీ గత రెండు రోజులు

తోటలో డంప్ చేసిన ఇసుక

నుంచి తరలింపు ప్రారంభించారని గ్రామస్తులు అంటున్నారు. లక్షల్లో ఆదాయం వస్తుండడంతో అక్రమార్కులు మళ్లీ ఇసుక తరలింపునకు తెరలేపారని గ్రామస్తులు చెబుతున్నారు. ఒక తారస్ లారీ లోడుగల నల్ల ఇసుకను సుమారు 5లక్షలకు విక్రయిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో లాభాలు వస్తుండడంతో వెనక్కి తగ్గినట్టే తగ్గి మళ్లీ తరలించడం మొదలు పెట్టారు. గతంలో అయితే ఏకంగా ఈ గ్రామంలో సముద్ర ఒడ్డుకు ట్రాక్టర్లు వెళ్లేలా రహదారిని నిర్మించడం విశేషం. అయితే ఇదే గ్రామానికి చెందిన వ్యక్తులు ఈ ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. సముద్ర ఇసుకను ఎవరైనా తరలిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దారు బంగార్రాజు హెచ్చరించారు.

# ప్రభుత్వ భూముల్లో 'ప్రయివేటు' రోడ్డు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్ పురం తానాన చెరువు గర్భంలో నుండి సన్‌ప్లస్‌వే రియల్ ఎస్టేట్ వ్యాపారి తన భూమికి దర్జాగా రోడ్డు వేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లో రహదారి వేసేందుకు కనీసం అనుమతులు తీసుకోకుండా వైసిపి నాయకుల సహకారాలతో రోడ్డు నిర్మాణం పనులు చేపడుతున్నారు. చెరువు గర్భంలో నుంచి రోడ్డు వేయడం వల్ల చెరువు దిగిన ఉన్న పంట పొలాలు ఆయకట్టుదారులకు నీరు నిలువ ఉండే అవకాశం లేకుండా పోతుందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే సర్పంచ్ జీ దేవి, రైతులు వి ముత్యాలు నాయుడు, ఎం చిన్న గోవింద, జి దేవుడు, ఎన్ దేముడు, వి పైడితల్లి

ఆక్రమణకు గురవుతున్న చెరువు గర్భం ఇదే..

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు చెబుతున్నారు. వెంటనే రియల్ ఎస్టేట్‌కు వేస్తున్న రహదారిని నిలుపుదల చేసి అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# గిరిజన గ్రామాల్లో జ్వరాల విజృంభణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి పంచాయతీ పరిధిలో గల గిరిజన గ్రామాలో దుంగాడ, చినదుంగాడ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో బాధపడుతున్న వారు వేపాడ పిహెచ్‌సికి వైద్యం నిమిత్తం రావాలంటే కనీసం 6కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తుంది. రహదారి సౌకర్యం కూడా సక్రమంగా లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. తాత్కాలికంగా ప్రైవేట్ డాక్టర్ గ్రామాల్లో వచ్చి మందులు ఇచ్చి సొమ్ముచేసుకుంటున్నట్లు గిరిజనలు చెబుతున్నారు. వేపాడ పిహెచ్‌సికి రాలేని గిరిజనలు దగ్గరలో ఉన్న దేవరాపల్లి ప్రైవేటు ఆసుపత్రికి ఆటోలు పై వెళ్లి వైద్యం చేయించుకుంటున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో

మంచానికే పరిమితమైన ఎరుకులు

భాగంగా వైద్య సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండక పోవడంతోనే ప్రయివేటు ఆస్పత్రిని ఆశ్రయించాల్సి వస్తుందని గిరిజనులు చెబుతున్నారు. తమ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించాలని కోరుతున్నారు

**ప్రయివేటు వైద్యుడే దిక్కు**

గత మూడు సంవత్సరాలుగా పక్షవాతం. ప్రస్తుతం జ్వరం కూడా వస్తుంది. వేపాడ వైద్య సేవలకు వెళ్లాలంటే ఆరు కిలోమీటర్లు ప్రయాణం చేయాలి. వెళ్లలేక వీలుపర్తి నుంచి వచ్చిన ప్రైవేటు వైద్యులతో వైద్య సేవలు పొందుతు న్నాను. గ్రామంలోకి వైద్య సేవలు అందిస్తే బాగుంటుంది.

**- బి.ఎరుకులు, దుంగాడ**

**రెండు రోజులుగా జ్వరం**

నాకు గత రెండు రోజులుగా జ్వరం వస్తుంది. ప్రైవేటు వైద్య సేవలు పొందుతున్నాను. వేపాడ పిహెచ్‌సికి వెళ్లాలంటే ఆటోలు అందుబాటులో లేనందున గ్రామంలోకి వచ్చిన ప్రైవేటు డాక్టర్ ఇచ్చిన మందులు వాడుతున్నాను.

**- బాడిత దేవుడమ్మ, దుంగాడ**

**వైద్య శిబిరాలు నిర్వహించాం**

ఈ మధ్యకాలంలో గిరిజన గ్రామాలైన కడ కొండ, దుంగాడ, చినదుంగాడ గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం. సోమవారం వైద్యం శిబిరం ఏర్పాటు చేసి ఇంటికి వెళ్లి సర్వే చేసి బాధితులను గుర్తించి వైద్య సేవలు అందేవిధంగా చర్యలు తీసుకుంటాం.

**- సిహెచ్.ఒ ఆంజనేయులు, వేపాడ**

# ఇంటింటికీ టిడిపి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకట రావు ఆధ్వర్యంలో ఆదివారం 26వ రోజు పట్టణంలోని ఆకుల డిపో వద్ద రిలే నిరాహారదీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్ష శిబిరం వద్ద మహిళలు కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేపాడ మండలం టిడిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట, పుణ్యగిరి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ వద్ద టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా 26వ రోజు శాంతియుతంగా సామూహిక రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నల్ల బ్యాడ్జిలు, కండువాలు ధరించి, మీతోనే మేము సైతం అంటూ చంద్రబాబునాయుడుకి మద్దతుగా సంఘీభావం తెలిపారు. మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న ఒంటి కాలపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్

దెంకాడ: ఇంటింటికి ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

నాయకులు పాల్గొన్నారు. **భోగాపురం:** మండలంలోని గుడివాడ, చెరుకుపల్లి, లింగాలవలస, పోలిపల్లి, కొత్త మరాడపాలెం, కవులవాడ పంచాయితీల్లో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కవులవాడ ఎంపిటిసి కోరాడ పద్మ, క్లస్టర్ ఇన్‌చార్జ్ దాసరి అప్పలస్వామి, తెలుగుయువత అధ్యక్షులు సరగడ తోగులురెడ్డి, నాయకులు బుగత రామ్మోహన్, నర్సింహులు పాల్గొన్నారు. **డెంకాడ:** బాబుతో నేను కార్యక్రమాన్ని మండలంలో బంటుపల్లి గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాల ద్వారా చంద్రబాబు నాయుడు అరెస్టుల గురించి వివరించారు. మాజీ ఎంపిపి కందిచంద్రశేఖర రావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, నాయకులు సంగం సురేష్, చిక్కాల శేషగిరి, రవి పాల్గొన్నారు. **బొబ్బిలి:** బొబ్బిలి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ బేబినాయన ఆధ్వర్యంలో బాడంగి మండలానికి సంబంధించి గజరాయని వలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, బొబ్బిలి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్ బాబు, బాడంగి మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, సింగిరెడ్డి భాస్కరరావు, గజరాయనివలస సర్పంచ్ మూడడ్ల సత్తిబాబు, నగుడు సత్యం, తెర్లి కామునాయుడు, గుల్లిపల్లి రామినాయుడు, బొబ్బిలి మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో S.O.P.14/2023

Between:

1. సింగిడి అప్పలనారాయణమ్మ, భర్త లేటు క్రిష్ణ, భోగాపురం గ్రామం, మండలం, విజయనగరం జిల్లా.
2. సింగిడి సురేంద్ర తండ్రి లేటు క్రిష్ణ – డిటో –
3. సింగిడి గిరిబాబు, తండ్రి లేటు క్రిష్ణ – డిటో –
4. కాకుమాని గౌరి తండ్రి లేటు క్రిష్ణ – డిటో –

......పిటీషనర్లు

And:

NiL ......రెస్పాండెంట్లు

**నోటీసు**

ఇందలి పిటీషనర్లు సింగిడి లేటు క్రిష్ణ వారసులుగా Succession Certificate జారీ చేయమని కోరుచూ కోర్టులో కేసును దాఖలు చేశారు. ఇందలి కేసులో ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలున్న ఎడల **తే 30-10-2023దీన ఉదయం 10-30గంటలకు** కోర్టుకి హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియజేయవలెను. అట్లు కానిచో మీ పరోక్షంగా ఉన్న ఆధారాల మేరకు కోర్టువారు వెల్లడి చేయడం జరుగుతుందని తెలియజేయడమైనది.

//బై కోర్టు ఆర్డర్//

పి.ధనంజయరావు
బి.ఈశ్వరరావు
పిటిషనర్ల తరుపు న్యాయవాదులు
విజయనగరం, సెల్: 9440711430

## బహిరంగ ప్రకటన

నేను, బలిజేపల్లి శ్రీనివాస గోదావరి రాజు, S/o. లేటు రామచంద్ర మూర్తి మరియు నా సోదరి బలిజేపల్లి సాయి నాగలక్ష్మి కామేశ్వరి, D/o. లేట్ రామచంద్రమూర్తి, Door No.23-7-3, వెళటూరివారి వీధి, రెవెన్యూ వార్డ్ No. 23, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, విజయనగరం జిల్లా, అను మేము ఇందుమూలముగా ఎల్లరకు తెలియజేయునది ఏమనగా:

మా తండ్రిగారైన బలిజేపల్లి రామచంద్రమూర్తి, S/o. లేట్ గోదావరిరాజు గారు వారసత్వముగా మరియు రిజిస్టర్ డాక్యుమెంట్ల ద్వారా Door No.23-7-3గా గలిగిన, వెళటూరివారి వీధిలో గల, రెవెన్యూ వార్డ్ No.23లో గల, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, విజయనగరం జిల్లా గల ఇంటిని మరియు ఇతర ఆస్తులను పొంది యున్నారు. మా తండ్రి గారు, మా తల్లి గారైన భానుమతి గార్ల మరణానంతరము వారికి క్లాస్-1 వారసులు గా సదరు ఇల్లు ఇతర ఆస్తులు మాకు వారసత్వముగా పూర్తి హక్కులతో దఖలు పడినవి. ప్రస్తుతము సదరు విజయనగరంలో వెళటూరివారి వీధిలో Door No.23-7-3, గా గలిగిన ఇంటికి, ఇంటిపన్ను మరియు నీటి పన్ను నా పేరున మార్పు చేయుటకు కమిషనర్, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ వారికి దరఖాస్తు చేసియున్నాను. ఇందునిమిత్తమై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి ఏడురోజులలో నాకు లిఖితముగా తెలుపగలరు. లేనియెడల నా పేరున చేయు సదరు మార్పు లకు ఎవరికినీ ఎటువంటి అభ్యంతరములు లేవని భావించి తదుపరి చర్యలు తీసుకొనగల వారము, అని ఈ ప్రకటన మూలముగా యావన్మందికి తెలియజేయడ మైనది.

**బలిజేపల్లి శ్రీనివాస గోదావరి రాజు**

నా చిరునామా:
బలిజేపల్లి శ్రీనివాస గోదావరి రాజు,
S/o. లేటు రామచంద్ర మూర్తి,
Door No.23-7-3, వెళటూరివారి వీధి,
విజయనగరం పట్టణం, విజయనగరం జిల్లా

# ప్రకృతి సాగుపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఒమ్మి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో పత్ర ద్రావణం తయారు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉత్తర కోస్తా రీజనల్ అధికారి హేమ సుందర్ రైతులకు పలు పత్ర ద్రావణం ఉపయోగాలు వివరించారు. వరిలో వచ్చే తెగుళ్ళ, పురుగులు, పొడ తెగుళ్లు, చీడ పీడలను పత్ర ద్రావణంతో నివారించుకోవచ్చని తెలిపారు. రైతులు ఏటిఎం మోడల్ వేసుకోడం వల్ల ప్రకృతి వ్యవసాయ పద్ధతి ఆచరించడంతో నిరంతరం కూరగాయలు దిగుబడిన పొందవచ్చని, నేలను 365 రోజులు కప్పి ఉంచవచ్చన్నారు. ఇలా చేయడం పౌష్టిక ఆహారంతో పాటు మంచి నేలలు తయారై చీడ పీడల సులువుగా నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సత్యనారాయణ, గాయత్రి, రామలక్ష్మి, లక్ష్మి, కృష్ణ, దుర్గ రావు, సంతోషి, దుర్గ, రవణమ్మ పాల్గొన్నారు.

**గుర్ల:** మండలంలోని గిరిడ గ్రామంలో ప్రకృతి

నెల్లిమర్ల: రైతులతో మాట్లాడుతున్న హేమసుందర్

వ్యవసాయ పద్ధతిలో భాగంగా ఆదివారం వరి పంటలో ఆకు చుట్టు పురుగు నివారణకు బ్రహ్మాస్త్రం తయారీ గురించి ప్రకృతి వ్యవసాయ కార్యకర్త కె సూర్యకుమారి వివరించారు. పిల్లా రాజేశ్వరి పొలంలో 2ఎకరాలు వరి పంటకు ప్రకృతి వ్యవసాయంలో వ్యవసాయం చేస్తు న్నారు. వరి పంటకు ఆకు చుట్టు పురుగు గుర్తించి నివార ణకు బ్రహ్మాస్త్రం తయారీ గురించి వివరించారు. తయారు విధానంపై రైతుకు వివరించారు. ఈ బ్రహ్మాస్త్రం పచ్చ పురుగు, గొంగులీ పురుగు, శనగ పచ్చ పురుగు, వరి పంటకు ఆకు చుట్టుపురుగు నివారణకు బాగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రాజేశ్వరి, బంగారం, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

## వృద్ధుడి మృతదేహం లభ్యం

**వంగర:** మండలంలోని నాగావళి నదిలో ఓని అగ్రహారం రేవు వద్ద వృద్ధుడు మృతదేహం లభ్యమయిందని ఎస్ఐ ఆర్ జనార్దన్ రావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మన్యం జిల్లా వీరఘట్ట మండలం చిదిమి గ్రామానికి చెందిన రౌతు నరసింహులు (87) అనే వృద్ధుడు బహిర్భూమికి గ్రామ సమీపంలోని గెడ్డ వైపు వెళ్ళగా కాలుజారి పడిపోవడంతో ఆయన మృతదేహం నాగావళి నది వంగర మండలం ఓని అగ్రహారం రేవు వద్ద లభ్యమైంది. మృతదేహం వద్దకు చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించామని మృతుని కుమారుడు భాస్కరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

## 8 కేజీల గంజాయి పట్టివేత

**శృంగవరపుకోట:** పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డు వద్ద ఇద్దరు వ్యక్తుల నుండి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్. ఐ. తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారంతో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో స్పెషల్ ఎంఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సిబ్బంది, ఎస్.కోట పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన దాడిలో మధ్యప్రదేశ్‌కు చెందిన విక్కీ, రాదే శ్యామ్ అను ఇద్దరు వ్యక్తుల నుంచి 8 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండకు తరలిస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.